నేటి నుంచి గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన

ముషీరాబాద్: గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కోసం శనివారం నుంచి దరఖాస్తులను పరిశీలించనున్నట్లు ఆజామాబాద్ విద్యుత్ డీఈ కమల్‌కుమార్ తెలిపారు. ఇందు కోసం ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రజాపాలన కేంద్రాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఇప్పటికే దరఖాస్తు వారు ఆహార భద్రత కార్డులు, విద్యుత్ బిల్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌లను అందజేయాలన్నారు. ఆహార భద్రత కార్డులున్న వారంతా ఈ పథకానికి అర్హులేనన్నారు. ఆరు గ్యారంటీల కోసం ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉచిత విద్యుత్ కోసం అదే ప్రజా పాలన కేంద్రంలో లబ్ధిదారులు సంబంధిత జిరాక్సు కాపీలను అందజేయాలని కోరారు.

మంత్రి పొన్నంను కలిసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను లయన్ కె.ఎన్.సామ్రాట్ కలిశారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీ డైరీ, నూతన సంవత్సర కేలండర్‌ను ఆయనకు బహుకరించారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకుని ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహాయాన్ని అందించేందుకు ముదుకు రావాలని మంత్రి ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులకు సూచించారు.

కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కాచిగూడలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గౌతమ్‌రావు

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోడీ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృత స్థాయిలో తీసుకువెళ్లాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. బీజేపీ బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా గురువారం కాచిగూడ డివిజన్ కాశీరాం జీరా, బసంత్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, బీజేపీ నేతలతో కలిసి పర్యటించి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, శ్యామ్‌రాజ్, కె.రమేష్ యాదవ్, కె.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ ఎన్నికల నిర్వహణకు సహకరించాలని వినతి



శాంతికుమార్

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ కృష్ణానగర్ బస్తీ కమిటీకి త్వరలో బస్తీ కమిటీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవకతవకలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని చిక్కడపల్లి ఏసీపీకి కృష్ణానగర్ బస్తీ మాజీ అధ్యక్షుడు వై.శాంతికుమార్ విజ్ఞప్తి చేశారు. గతంలో జరిగిన ఎన్నికల్లో కొందరు అవకతవకలు చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. కృష్ణానగర్ బస్తీ ఒక వైపు హరినగర్, మరో వైపు అంబేడ్కర్‌నగర్ ఉంటాయని దీంతో బస్తీకి చెందని వారు తాము కూడా కృష్ణానగర్ వాసులమేనని ఓట్లు వేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. త్వరలో కృష్ణానగర్ సరిహద్దులపై సర్వే చేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఏసీపీని కూడా కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు శాంతికుమార్ తెలిపారు.

నేత్రపర్వం.. సత్యహరిశ్చంద్ర నాటకం

చిక్కడపల్లి: బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర నాటక డాక్టర్ శూలపాణి ఆధ్వర్యంలో రసభరితంగా ప్రదర్శించారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి జన్మదిన వేడుకల సందర్భంగా జరుగుతున్న కళాసప్తాహమ్‌లో భాగంగా సత్యహరిశ్చంద్ర నాటకంలోని ఘట్టాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా మాజీ జడ్జి బూర్గుల మధుసూదన్ పాల్గొని కళాకారులను అభినందించారు. గాయకుడు త్రినాథరావు, గానసభ పాలమండలి సభ్యులు బండి శ్రీనివాస్, ద్రావిడలు పాల్గొన్న సభకు గానసభ అధ్యక్ష్యుడు కలా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించారు.

'శాంతిశిఖర' అభివృద్ధికి కట్టుబడి ఉన్నా: ఎమ్మెల్యే దానం

పంజగుట్ట: తమ కాంప్లెక్స్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సోమాజిగూడ శాంతి శిఖర అపార్ట్‌మెంట్ (ఎస్ఎస్ఏ) కార్యవర్గ సభ్యులు గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ గౌరవాధ్యక్షుడు రమేష్ హజారి ఆధ్వర్యంలో బృందం దానం నాగేందర్‌ను ఘనంగా సత్కరించారు. గతంలో ఎన్నికల సమయంలో దానం నాగేందర్ తమ అపార్ట్‌మెంట్‌కు వచ్చి ఇచ్చిన హామీలు, అభివృద్ధి కార్యక్రమాల గూర్చి చర్చించి వారిని పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. శాంతి శిఖర కాంప్లెక్ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, త్వరలోనే అపార్ట్‌మెంట్‌కు వచ్చి సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ధని ఏలే, కార్యదర్శి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రభాత్, కోశాధికారి మాధవ్‌రెడ్డి, సభ్యురాలు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నేడు టెన్త్ విద్యార్థులకు మోటివేషన్ క్లాస్‌లు

ఫిలింనగర్: ఫిలింనగర్ 23 బస్తీల్లో పదో తరగతి చదువుకుంటున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పరీక్షలంటే భయం పోగొట్టడం, జీవితం అంటే ఏమిటి, భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలనే అంశాలపై స్థానిక ఫైవ్ ఫింగర్స్ అనే సంస్థ మోటివేషన్ క్లాసులు ఏర్పాటుచేసింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వేణుక ళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ మోటివేషన్ క్లాసులు తీసుకుంటారని ఫైవ్ ఫింగర్స్ సంస్థ అధ్యక్షుడు సలాది శ్రీనివాస్ తెలిపారు. క్లాసుల అనంతరం విద్యార్థులకు పరీక్షల కిట్లు కూడా అందజేస్తామని తెలిపారు. ప్రతియేటా ఈ బస్తీలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు అంటే భయం పోగొట్టేలా నిపుణులతో మోటివేషన్ క్లాసులు ఇప్పించడం జరుగుతుందని, ఏయేటికాయేడు ఈ క్లాసులు విజయవంతంగా సాగుతున్నాయని, విద్యార్థులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

యువకుడిని బెదిరించి నగదు దోపిడీ

వెంగళరావునగర్: షాపు ముగించుకుని ఇంటికి వెళుతున్న యువకుడిని ఆపి దారి దోపిడీకి పాల్పడిన సంఘన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఎర్రగడ్డ శివాజీనగర్‌కు చెందిన రాథోడ్ సురేష్ ఛాట్ బండి నిర్వహిస్తుంటాడు. బుధవారం అర్ధరాత్రి షాపును మూసి వేసి ద్విచక్ర వాహనంపై తన సోదరుని ఇంటికి వెళుతున్నాడు. మార్గమధ్యలో ఆలీనగర్ సమీపంలోకి రాగానే 30–35 ఏళ్ల వయసున్న అగంతకుడు వచ్చి సురేష్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఆపాడు. అనంతరం డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. అంతేగాకుండా సురేష్‌ను తీవ్రంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ కొట్టాడు. అనంతరం అతని వద్ద ఉన్న రూ. 1600 తీసుకుని పారిపోయాడు. బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ జిలుకర శ్రీనివాస్



బాధితులకు సంఘీభావంగా దీక్షలో పాల్గొన్న వినయ్‌కుమార్

పెద్దల కోసమే పేదల ఇళ్ల కూల్చివేత

- వివేకానందనగర్ బస్తీలో పేదల ఇళ్ల కూల్చివేతపై ఆగ్రహం
- బాధితులకు పునరావాసం కల్పించే అంశంపై తీవ్ర నిర్లక్ష్యం
- పది రోజులుగా దీక్ష చేస్తున్నా స్పందించని అధికారులు
- అధికారుల తీరు దారుణం: ప్రజా సంఘాల నేతలు

చిక్కడపల్లి: జంటనగరాలలో పెద్దల కోసం పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ నగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ బస్తీలో పేదల ఇళ్ల కూల్చివేతపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా ఇళ్ల కూల్చివేత బాధితులు చేస్తున్న దీక్షకు వివిధ సంఘాలు గురువారం సాయంత్రం మద్దతు ప్రకటించాయి.

◆ ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో బాధితులకు సంఘీభావం ప్రకటించిన విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ... నగరంలో 300 మురికివాడల్లో ఇళ్లు అక్రమంగా నిర్మించుకున్నారని ఆరోపిస్తూ ఆయా ఇళ్లను కూల్చివేసేందుకు అధికారులు కుట్రలు పన్నుతున్నారన్నారు. కూల్చివేతలకు వ్యతిరేకంగా ఐక్యపోరాటం చేసి బస్తీలను కాపాడుకుందామన్నారు. దశలవారీగా ఉద్యమం చేపడుతామని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. నిరాశ్రయ శ్రామిక సంఘటన సంస్థ మధ్యాహ్నం భోజనాన్ని బాధితులకు అందజేసింది. బాధితులకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, మాల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాబురావు, వీసీకే పార్టీ నాయకులు మచ్చ దేవేందర్, ఆనంద్, శ్యామ్, డీబీఎఫ్ నాయకులు పులి నవీన్‌కుమార్, కవిత, రామోజీ, బాధితులు ఆనంద్, కృష్ణ, వసంత్, భాగ్య, సువర్ణ, ఇందు , పూజ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో బాధితులకు 'డబుల్' ఇళ్లకు కేటాయించాలి: బీజేవైఎం

వివేకానందనగర్ బాధితులను వారం రోజుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించి చేర్పించకపోతే నిరసన ఉధృతం చేస్తానని నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయకుమార్ హెచ్చరించారు. బీజేవైఎం, బీజేపీ నాయకులతో కలసి ఆయన దీక్షా శిబిరంలో బాధితులకు గురువారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంతవరకు ఏ ప్రభుత్వ అధికారీ బాధితులను పట్టించుకోకపోవడమే కాకుండా వారికి ఇంతవరకు పునరావాసం కల్పించడం లేదని ధ్వజమెత్తారు. వెంటనే ఇండ్లు కూల్చివేతతో రోడ్లపైకి వచ్చిన బాధితులను డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లలోకి చేర్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. న్యాయం జరిగేవరకు బాధితులకు అండగా నిలుస్తామమని వినయ్‌కుమార్ స్పష్టం చేశారు. బాధితులు ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్, తిలక్, సాయి, భార్తి, కన్యాకుమారి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ స్వామి కీర్తనలు ఎంతో మధురం



నల్లకుంట: న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం త్యాగరాజ స్వామి కీర్తనలు భక్తి పారవశ్యంతో మునిగిపోతున్నది. శ్రీ రామగాన సభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాన్ని శ్రీరామగాన సభ కార్యదర్శి కొణికి శ్రీనివాస శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకరైన త్యాగరాజ స్వామి కీర్తనలు ఎంతో మధురంగా ఉంటాయన్నారు. ఈయన ఎన్నో ఉత్సవ సంప్రదాయ కీర్తనలు, దివ్యనామ కీర్తనలు సమకూర్చారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసులు ఆర్వీ పాండురంగ శర్మ గాత్ర కచేరి సంగీతాభిమానులను సంగీతాభిమానులను ఆద్యంతం ఆకట్టుకుంది. దీనికి మృదంగంపై సి.హెచ్.రామకృష్ణ, వయోలిన్‌పై ఎన్సీ. అనంత కృష్ణ, , ఘటంపై టీబీ బాలు, కంజీరపై డాక్టర్ ఆర్. శ్రీకాంత్ వాద్య సహకారం అందించారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



షబ్బీర్‌అలీకి వినతిపత్రం సమర్పిస్తున్న వడ్డెర సంఘం నేతలు

చిక్కడపల్లి: దీర్ఘకాలికంగా ఉన్న డిమాండ్ ప్రకారం వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య సలహాదారు షబ్బీర్ అలీని సచివాలయంలో గురువారం వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జరిపేటి సత్యనారాయణ, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య తదితరులు కలసి వినతిపత్రం సమర్పించారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చేలా ప్రభుత్వానికి నివేదించాలని షబ్బీర్‌అలీని కోరారు. నేతలు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, బండారి శ్రీరాములు, ముక్కలి వెంకటేష్, గుంజ సాయికృష్ణ, దండుగుల రాములు, తన్నీరు వెంకటకృష్ణ పాల్గొన్నారు.

వైద్యరత్న అవార్డులు అభినందనీయం

మంత్రి దామోదర రాజనర్సింహ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

శ్రీనగర్‌కాలనీ: వైద్యరంగంలో విశిష్ట సేవలు అందించిన వైద్యులకు వైద్యరత్న అవార్డులు ఇచ్చి సత్కరించిడం శుభపరిణామమని, ఇప్పటికే నాలుగు పర్యాయాలు వైద్యరత్న అవార్డులను అందించిన జేఎంజీ గ్రూప్స్ కృషి ప్రశంశనీయమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో 2024 సంవత్సరానికిగాను వైద్యరత్న అవార్డుల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కరోనా సమయంలో వైద్యుల సేవలు మరువలేనివని, అలాంటి వైద్యులకు ఇలాంటి అవార్డులను అందించడం అభినందనీయమన్నారు. జేఎంజీ గ్రూప్స్ సీఈఓ ఎం.జగన్ మాట్లాడుతూ... 2015 నుంచి వైద్యరత్న అవార్డులను అందిస్తున్నామని, 5వసారి ఈ అవార్డుల ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు. కరోనాలో విశిష్ట సేవలు చేసిన డాక్టర్లను ఘనంగా సత్కరించామని, ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియను మొదటుపెట్టామని, ఫిబ్రవరి 29 వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. మార్చి 21న వైద్యరత్న అవార్డులను మంత్రి దామోదర రాజనర్సింహ చేతులమీదుగా అందజేస్తామన్నారు. జేఎంజీ గ్రూప్స్ డైరెక్టర్ నీలిమ, పవన్, యూఆర్ఆర్ గ్రూప్స్ ఎండీ పరుపాటి శ్రీనివాసరెడ్డి, ఐకానిక్ ఎండీ శ్రీనివాసగౌడ్, వెరొనిక ఈవెంట్స్ ఎండీ సుమన్ పాల్గొన్నారు.

లష్కర్ ఓటర్ల తుది జాబితా విడుదల



ఓటరు జాబితాను నోటీసు బోర్డులో పెట్టిన అధికారులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం ఓటర్ల జాబితా తుది ప్రచురణ ప్రతులను గురువారం జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు విడుదల చేశారు. ఇప్పటికే చిరునామాల మార్పులు, తప్పొప్పుల సవరణలు, కొత్త పేర్ల నమోదు, తొలగింపుల అనంతరం కొత్త జాబితాను రూపొందించినట్టు సికింద్రాబాద్ సర్కిల్ ఎన్నికల అధికారి ఎస్.సుధాంశ్, ప్రత్యేక అధికారి మైఖేల్ బోస్ తెలిపారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో సందర్శకుల కోసం ఓటర్ల జాబితాను ఉంచడంతోపాటు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు జాబితా కాపీని అందిస్తామన్నారు. 2024 తుది ఓటర్ల జాబితా ప్రకారం నియోకవర్గ ఓటర్ల సంఖ్య 2,67,282కు చేరింది. పురుషులు 1,33,650, స్త్రీలు 1,33,607, ఇతరులు 25 మంది ఉన్నారు. ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన పోలింగ్ స్టేషన్లు, బూత్‌ల ఎంపిక ప్రక్రియను కూడా పూర్తి చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలోని 102 భవనాల్లో 220 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. ఓటర్లు తమ జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జయప్రకాష్



కాచిగూడ: మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏలిజాల ప్రవీణ్ జయప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ అందజేశారు. దళిత బహుజన పార్టీ ఉపాధ్యక్షుడు సి.యాదగిరి, మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా దేవేందర్ రావు, మహిళాధ్యక్షురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీఆర్‌పీఎస్ భాగ్యనగర్ అధ్యక్షుడిగా సుధాకర్



నల్లకుంట: ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి (ఎస్సీఆర్‌పీఎస్) బాగ్యనగర్ అధ్యక్షుడిగా నల్లకుంట నర్సింహబస్తీకి చెందిన మందా సుధాకర్ నియమితులయ్యారు. ఎస్సీ ఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు కర్ని శ్రీశైలం ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మారేడు మోహన్ గురువారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.

లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

చిక్కడపల్లి: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్ సూచించారు. జిల్లా ప్రాధాన కార్యదర్శిగా నియమితులైన బుసమల్ల మైఖేల్ ప్రసన్న గురువారం అనిల్‌కుమార్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ... సికింద్రాబాద్ లోకసభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటుబ్యాంకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు వివరించి హస్తం గుర్తుకు ఓటు వేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఘంటసాల గానం చిరస్మరణీయం

చిక్కడపల్లి: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గానం ఎప్పటికీ నిలుస్తుంది ఎస్బీఐ డీజీఎం గరికపాటి వెంకట్ అన్నారు. శ్రీరామ సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ఘంటసాల బాలసుబ్రహ్మణ్యం గీతాల గాన కార్యక్రమం జరిగింది. వంశీ రామరాజు నిర్వాహకుడు చంద్రశేఖర్ గౌర్రి, ప్రముఖ గాయకులు వైఎస్ రామకృష్ణ, కే.రాజు, శశికళస్వామి, సురేఖమూర్తి పాల్గొన్నారు.

సీఎంపై నిరాధార ఆరోపణలను సహించం

చిక్కడపల్లి: మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై నిరాధార ఆరోపణ చేస్తే యావత్ క్రైస్తవ సమాజం క్షమించదని సీనియర్ కాంగ్రెస్ నేత కెన్నడీరాజు హెచ్చరించారు. కేసీఆర్ ఎంగిలి మెతుకులు కోసం ఆశపడి తమ నేత రేవంత్‌రెడ్డిపై అనుచితంగా మాట్లాడటం సబబు కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేసే కనీస అర్హత, స్థాయి బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు.

రజకుల సంక్షేమానికి రూ. వెయ్యి కోట్లు కేటాయించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రజక వృత్తిదారుల సంక్షేమానికి రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.ఆశయ్య డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆశయ్య మాట్లాడుతూ... తెలంగాణ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పైన ఏర్పాటు చేయాలన్నారు. వృత్తి కాంట్రాక్టుకు జీవో నెంబర్ 102 గైడెన్స్ రూపొందించి వృత్తిదారులకు ఉపాధి కల్పించాలని కోరారు. రజక ఫెడరేషన్‌కు వెంటనే పాలక వర్గాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షులు గుమ్మడిరాజు నరేష్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలకృష్ణ, సి.మల్లేష్, వెంకటేశ్వర్లు, రాములు, గోపాల్, సుభద్ర, ముదిగొండ రాంబాబు, భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



శ్యామ్‌ప్రసాద్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రవిచారి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని శ్యామ్‌ప్రసాద్‌నగర్ బస్తీలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచారి మాట్లాడుతూ... డివిజన్‌లోని అనేక బస్తీల్లో పర్యటిస్తు డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్ తదితర సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కులగణనకు చట్టబద్ధత కల్పించాలి

కాచిగూడ: అసెంబ్లీ సమావేశాల్లో కులగణనపై గవర్నర్ చేసిన ప్రసంగంలో అనేక అనుమానాలు ఉన్నాయని, కులగణనకు చట్టబద్ధత తీసుకురావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ ఆర్.వి.మహేందర్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నారాయణగూడలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టనున్న కులగణన విషయంలో స్పష్టతను తీసుకువచ్చి ప్రజల్లో ఉన్న ఆందోళనను తొలగించాలని అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పూలే దంపతుల విగ్రహం ఏర్పాటు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాజకీయాలకతీతంగా పూలే విగ్రహా ఏర్పాటుకు బీసీ అందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు సమష్టిగా పనిచేద్దాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎంవో హరిచంద్రప్రసాద్

ముషీరాబాద్: కుష్టు వ్యాధిని భూస్థాపితం చేసేందుకు అందరూ సమష్టిగా పని చేద్దామని డీపీఎంవో హరిచంద్రప్రసాద్ అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం ముషీరాబాద్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అక్స్‌ఫర్డ్ స్కూల్‌లో విద్యార్థులకు స్పర్శ్ లెప్రసీ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుష్టు వ్యాధిని ప్రారంభదశలో గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చునన్నారు. ఇందుకు సంబంధించి మందులు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా లభ్యం అవుతాయన్నారు. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం విజయకుమారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ్‌కు సన్మానం



కోదండరామ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ప్రతిపాదించిన ప్రొఫెసర్ కోదండరామ్ గురువారం సాయంత్రం నల్లకుంట శంకరమఠం మార్కెట్ రోడ్డులోని మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనారెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనారెడ్డి సోదరుడు హరినాథ్‌రెడ్డి, పార్టీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టల సుభాష్ తదితరులు కోదండరామ్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడికి విచ్చేసిన ఖైరతాబాద్ డీసీసీ ప్రెసిడెంట్ డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కె.గోవర్ధన్ రెడ్డి, చింతల ధనార్జున్‌రెడ్డి, కుతాడి రవికుమార్, దేవిరెడ్డి విజితారెడ్డి, హరితో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అధిక లాభాల పేరుతో రూ. 32 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ. 32 లక్షలను కాజేశారు సైబర్ నేరగాళ్లు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి సమాచారం మేరకు... నగరానికి చెందిన ఓ వ్యక్తికి టెలిగ్రామ్ ద్వారా ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టాలని మెసేజీలు పంపారు. మొదట కొంత డబ్బు పెట్టుబడి పెడితే లాభాలు ఇచ్చి నమ్మించారు. వివిధ టాస్కులు పూర్తి చేయడం ద్వారా తక్కువ కాలంలో ఇంటి వద్దనే ఉంటూ లక్షలాది రూపాయలు సంపాదించవచ్చని తెలిపారు. లాభాలు విత్ డ్రా చేసుకోవాలంటే అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేశారు. ఈ విధంగా పెట్టుబడులు పెడితే లక్షల రూపాయలు లాభాలు వచ్చాయని సైబర్ కేటుగాళ్లు సృష్టించిన నకిలీ అకౌంట్లలో లక్షల రూపాయలు ఉన్నట్లు బాధితుడిని నమ్మిస్తూ.. టెలిగ్రామ్‌లో సందేశాలు పంపారు. ఈ విధంగా మూడు నెలల కాలంలో విడతల వారీగా 32 లక్షల రూపాయలు కాజేశారు. అనంతరం వారు స్పందించకపోవడంతో మోసపోయానని బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు, ఈ తరహా సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ శివమారుతి సూచించారు.

వెంకటేశ్వరనగర్‌లో రేషన్‌షాపు ఏర్పాటు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని వెంకటేశ్వరనగర్‌లో కొత్తగా రేషన్‌షాపు తెరిచారు. బస్తీవాసుల డిమాండ్ మేరకు గురువారం బస్తీలో రేషన్ షాపును అందుబాటులోకి తీసుకువచ్చి వినియోగదారులకు సరుకులు పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఈ షాపును సందర్శించి వినియోగదారులతో మాట్లాడారు. ఎన్నోసార్లు ఇక్కడ షాపును తెరిపించాల్సిందిగా బస్తీవాసులు ఆమెకు విన్నివించగా పలుమార్లు పౌరసరఫరాల శాఖ అధికారులతో కార్పొరేటర్ సంప్రదింపులు జరిపారు. ఆమె విజ్ఞప్తి మేరకు ఇక్కడ ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని షాపును తెరిచారు.